క్లుప్తంగా

పులివాహనంపై చాముండేశ్వరీదేవి



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చాముండేశ్వరీదేవి అమ్మవారు పులివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉభయదాతలుగా స్థానికులు మూలగల ప్రదీప్–మాధవీ, పుల్లా విశ్వేశ్వర్‌రెడ్డి– మంజుల దంపతులు వ్యవహరించారు. ఉదయం జరిగిన చప్పర ఉత్సవానికి కొండూరు సురారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగొద్దని దండోరా వేయించాలని పేర్కొన్నారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ సమావేశంలో పలు సమస్యలను తీసుకురాగా వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్యామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంకన్నపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు : మండలంలోని వెంకన్నపురంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య బృందం వారు మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో క్షయ వ్యాధి బాధితుని ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఆ వ్యక్తి వ్యాధి నుంచి కోలుకొని మెరుగు పడినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గీతా సాహితి మాట్లాడుతూ గతంలో ఇక్కడికి వచ్చిన సమయంలో ఆ వ్యక్తికి వ్యాధి తీవ్రంగా ఉండేదని, వైద్య పరీక్షలు చేసి మందులు, ఆరోగ్య సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. మందులు క్రమం తప్పకుండా వినియోగించడం వల్ల అతను త్వరగా కొలుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ బి.పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ పి.శ్రీలత, హెచ్‌ఏలు షఫీఉద్దీన్, రమణమ్మ, ఆశా కార్యకర్త కె.కృష్ణకుమారి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చేపట్టాలని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. 'వృక్ష సే వికాస్' నినాదంతో మంగళవారం మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి, పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్, ఆపరేషన్ హెడ్ మనీష్ దవే, ఈహెచ్‌ఎస్ హెడ్ వేణుగోపాలరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌లో రేపట్నుంచి తరగతులు

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని హైస్కూల్ ప్లస్(బాలికలు)లో గురువారం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని హెచ్‌ఎం డి.ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది(2022–23) విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ బాలికల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే బాలికలకు తగినన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

టీడీపీవి ఎన్నికల స్టంట్లే

- ఆ పార్టీ మేనిఫెస్టోలో ఏమీ లేదు
- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ సీఎం చంద్రబాబు అధికారం కోసం ఎంత దిగజారిపోయారనే దానికి మహానాడులో ఆయన ప్రకటించిన మేనిఫెస్టోనే నిదర్శనమని.. ఎన్నికల స్టంట్లే తప్ప అందులో ఏమీ లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని 54వ డివిజన్ ఇస్లాంపేటలోని పెన్నా బ్రిడ్జి కింది భాగం, పెద్ద మసీదు వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో పది శాతాన్ని కూడా నెరవేర్చలేదని చెప్పారు. దీంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పారన్నారు. నవరత్నాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారని.. దీన్ని ఓర్చుకోలేని చంద్రబాబు, లోకేష్, ప్యాకేజీ స్టార్, తదితరులు విమర్శలు చేస్తుండటం హాస్యాస్పదమని తెలిపారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రూ.70 వేల కోట్ల అప్పును మోపిందని, వీటిని చెల్లిస్తూ పేదలకు సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు లోకేషే పప్పు అనుకున్నామని, అయితే చంద్రబాబు ఇంకా పెద్ద పప్పు అని తెలిసిందని విమర్శించారు. కార్పొరేటర్ సఫియా బేగం, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్లను విధిగా ఏర్పాటు చేసుకోవాలి

- కమిషనర్ వికాస్ మర్మత్



దుకాణ నిర్వాహకుడితో మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): దుకాణాల వద్ద డస్ట్ బిన్లను విధిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండ్, పాత అర్చన థియేటర్ పరిసరాలు, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతం, పరమేశ్వరినగర్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

స్పందన ఫిర్యాదుల పరిశీలన

స్పందనలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి కమిషనర్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆటోనగర్‌లోని అయ్యల్‌రెడ్డి లేఅవుట్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. నివాసాల మధ్య ప్లాస్టిక్ నిరుపయోగాలను వినియోగించడం, నిల్వ ఉంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. అనంతరం పడారుపల్లి, బీవీనగర్, తదితర ప్రాంతాల్లో లేఅవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సామూహిక నిరశన దీక్ష

నెల్లూరు(దర్గామిట్ట): తమ సమస్యలు, న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట ఒక రోజు సామూహిక నిరాహార దీక్షను ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. జేఏసీ జిల్లా అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సభ్యులు మురళీకృష్ణ, సురేష్‌బాబు, వెంకటరమణయ్య, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభం



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని జేమ్స్‌గార్డెన్‌లో నూతనంగా నిర్మించిన సీఐటీయూ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక కార్మిక ఉద్యమాలకు సీఐటీయూ ప్రాతినిధ్యం వహించిందని చెప్పారు. భవిష్యత్తులో కార్మికులు చేపట్టనున్న ఉద్యమాలకు సీఐటీయూ జిల్లా కార్యాలయం ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. తొలుత కార్మిక సంఘ జెండాను జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, సీఐటీయూ నేతలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రసాద్, నాగేశ్వరరావు, గోపాల్, చాన్‌బాషా, రెహానాబేగం, అన్నపూర్ణమ్మ, మస్తాన్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన



ఎంపీ ఆదాల నివాసంలో కార్పొరేటర్లు, నేతల సంబరాలు

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో కార్పొరేటర్లు, పార్టీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు.

నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని 33వ డివిజన్లో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. పార్టీ నేతలు ప్రభాకర్, మేఘనాథ్‌సింగ్, రవి, అశోక్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అందరూ మరింత కష్టపడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించాలని 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ ఆచారి పేర్కొన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు డివిజన్లో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి నగదు బహుమతులను అందజేశారు. రంగనాథస్వామి దేవస్థాన చైర్మన్ శివకుమార్ ఆచారి, పార్టీ నేత సురేష్, తదితరులు పాల్గొన్నారు.



33వ డివిజన్లో..



47వ డివిజన్లో..

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): సచివాలయాల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ప్రభుత్వం నుంచి అవసరమైన సేవలను అందించాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని 33 / 1 నేతాజీనగర్ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. సచివాలయంలోని ఇన్‌స్పెక్షన్.. హాజరు.. స్పందన రిజిస్టర్లతో పాటు నోటీస్ బోర్డులోని ప్రభుత్వ పథకాల ప్రచార పత్రాలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. స్పందన అర్జీలను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలని సూచించారు. కార్పొరేటర్ మంజుల, అడిషనల్ కమిషనర్ శర్మద, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



నెల్లూరు రూరల్: సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసే అంశంలో వలంటీర్లు అందిస్తున్న సేవలను విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి అభినందించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు బుజబుజనెల్లూరులోని న్యూ కాలనీలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను సత్కరించారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన



వివరాలను ఆరాతీస్తున్న హర్షవర్ధన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మొగళ్లపాళెంలో 150 ఎకరాల విస్తీర్ణంలో ఖేలో ఇండియా ద్వారా రూ.ఎనిమిది కోట్లతో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం పనులను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీలైనంత త్వరగా ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజినీర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తదితరులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

చీర తెచ్చిన తంటా..

- ఈదురుగాలులతో విద్యుత్ లైన్‌పై పడిన వైనం
- ట్రిప్పైన ఎన్టీఎస్ ఫీడర్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో మంగళవారం మధ్యాహ్నం వీచిన భారీ ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్లపై చీర పడటంతో ఎన్టీఎస్ ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడ్డాయి. నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి సరఫరాను పునరుద్ధరించారు.

వెంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వేసవి శిబిరంతో చిన్నారులకు మేలు

కొడవలూరు: వేసవి శిబిరంలో ఇచ్చే శిక్షణ ద్వారా చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని కొడవలూరు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులతో చిత్రలేఖనం వేయించడం, నీతి కథలు చెప్పించడం, డిక్టేషన్ రాయించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ క్రమం తప్పకుండా ఏదో ఒక అంశంలో శిక్షణ ఇస్తామని, వీటిని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మనుబోలు : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు–పొదలకూరు రహదారిపై రైస్‌మిల్లు వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలానికి చెందిన ఆవుల ముత్యాలయ్య(37) గత నాలుగు రోజులుగా బండేపల్లి గ్రామంలోని తన సోదరి పోలమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో పిడూరు గ్రామంలో ఉన్న మరో సోదరి వద్దకు వెళ్లేందుకు సోమవారం రాత్రి రోడ్డు మార్గంలో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రెజ్లర్లకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత యశోధర పేర్కొన్నారు. రెజ్లర్లకు సంఘీభావంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద మంగళవారం చేపట్టిన నిరసన దీక్షలో ఆమె మాట్లాడారు. రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ నేతలు శేషారెడ్డి, రఘురామ్ ముదిరాజ్, నేతలు సాయిరామ్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం మధ్యాహ్నం కురిసింది. దీంతో పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకూలగా, విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి తొమ్మిది గంటలకు కూడా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. రూరల్ పరిధిలోని పడమటి వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్, పలు ప్రాంతాలు అంధకారంగా మారాయి. విద్యుత్ శాఖ నుంచి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు.

బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరంలోని బంగ్లాతోటకు చెందిన శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు మూడుసార్లు పనిచేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నెల్లూరు(బారకాసు): తమ సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ కోరారు. ఈ మేరకు పలువురితో కలిసి కమిషనర్ వికాస్ మర్మత్‌కు కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడారు. కొండాయపాళెం, ఎరుకులపాళెం ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను తెలియజేశారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామమందిరం వీధికి చెందిన ఆకులూరు కామేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. నెల్లూరు రోడ్డులో అమ్మ వాటర్ ప్లాంట్ వద్ద నుంచి కామేశ్వరరావు తన బైక్‌లో వస్తుండగా పల్సర్‌బైక్‌పై అతివేగంగా వెళ్తున్న యువకుడు ఢీకొన్నాడు. దీంతో కామేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భార్య సుజాతలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బంధువుల సాయంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి నెల్లూరుకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని విజయా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

